# ఆదిలాబాద్ వార్త



మంచిర్యాల, కొమురం భీం ఆసిఫాబాద్, నిర్మల్

సోమవారం 1, డిసెంబర్ 2025


## నామినేషన్ ప్రక్రియ సమర్థవంతంగా నిర్వహించాలి



*** జిల్లా అదనపు కలెక్టర్ దీపక్ తివారి**

కాగజ్‌నగర్ రూరల్, ప్రభాతవార్త

2వ సాధారణ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో నామినేషన్ ప్రక్రియ పారదర్శకంగా, సమర్థవంతంగా నిర్వహించాలని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) దీపక్ తివారి అన్నారు. ఆదివారం జిల్లాలోని పెంచికల్ పేట, చింతలమానెపల్లి మండల కేంద్రంతో పాటు బెజ్జూర్ మండలంలోని ఊట్సా రంగపల్లి, సులుగుపల్లి, కుంటలమానేపల్లి, అందులగూడ, రెబ్బెన, తుమ్మలగూడ గ్రామాలకు ఊట్సా రంగపల్లి గ్రామపంచాయతీలో ఏర్పాటుచేసిన నామినేషన్ స్వీకరణ కేంద్రాలను కాగజ్ నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధశుక్లాతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ రిటర్నింగ్, సహాయ రిటర్నింగ్ అధికారులు నామినేషన్ ప్రక్రియ పూర్తి పారదర్శకంగా నిర్వహించాలని తెలిపారు. నామినేషన్ పత్రాల ధృవీకరణ, అభ్యర్థుల వివరాల నమోదు, అవసరమైన రికార్డుల నిర్వహణ అంశాలను పకడ్బందీగా నిర్వహించాలని,నామినేషన్ల స్వీకరణలో ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. అభ్యర్థుల సమర్పించిన పత్రాలను క్షుణ్ణంగా పరిశీలించాలని, అభ్యర్థులు, ప్రతినిధులు,ప్రజల రాకపోకలు సజావుగా మిగతా 2లో..



# లారీని ఢీ కొట్టిన ప్రైవేటు బస్సు

*** ప్రమాదంలో బస్సు కండక్టర్, 4 సంవత్సరాల బాలుడు మృతి**

*** మరో ఇద్దరికి గాయాలు**

*** ప్రమాద స్థలిని పరిశీలించిన జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్**

నేరడిగొండ, నవంబర్ 30, ప్రభాతవార్త :

మండలంలోని బోథ్ ఎక్స్ రోడ్డు వద్ద ఆదివారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి చెందగా, మరో ఇద్దరు తీవ్రంగా గాయపడినట్లు నేరడిగొండ ఎస్ఐ ఇమ్రాన్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్ నుంచి ఉత్తరప్రదేశ్‌లోని గోరఖ్పూర్‌కు వెళుతున్న ట్రావెల్ బస్సు ముందు వెళ్తున్న లారీని వెనుక నుంచి బలంగా ఢీకొంది. దీంతో బస్సులో ప్రయాణిస్తున్న దీప్సన్ నిషాద్ (4), రవి సింగ్(60) మృతి చెందగా సోను నిషాద్, సారికలు తీవ్రంగా గాయపడ్డారు. బస్సు అతివేగంగా వెళ్లి లారీని ఢీకొనడంతోనే ప్రమాదం జరిగి ఉండవచ్చని అనుమానిస్తున్నారు. ప్రమాద తీవ్రతతో బస్సు ముందుభాగం నుజ్జునుజ్జయింది. ప్రమాద విషయం తెలుసుకున్న నేరడిగొండ ఎస్ఐ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టారు. 2లో..







మృతిచెందిన రవి సింగ్

దీప్సన్ నిషాద్

## శనివారం నామినేషన్... ఆదివారం మృతి



మామడ, నవంబర్ 30, ప్రభాత వార్త

మండలంలోని పొంకల్ గ్రామానికి చెందిన దుబ్బాక జమున (45) శనివారం గ్రామంలో 12వ వార్డు సభ్యురాలిగా పోటీచేసేందుకు నామినేషన్ దాఖలు చేసింది. దురదృష్టవశాత్తు ఆదివారం గుండెపోటుతో మృతి చెందింది. దీంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

## ప్రజల ప్రాణాల కంటే.. ఖజానా ముఖ్యమా..?

**✦ వైన్ షాపును గ్రామం బయటకు మార్చాలి ✦ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డా.ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్**



కాగజ్‌నగర్, నవంబర్ 30, ప్రభాతవార్త :

తెలంగాణ ప్రభుత్వం ఖజానా కోసం ఏం చేయడానికైనా వెనకపడ లేదని,ప్రజల ప్రాణాలను లెక్కచేయకుండా విచ్చల విడిగా వైన్ షాపులు ఏర్పాటు చేస్తున్నారని బిఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డా.ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ఆరోపించారు. కాగజ్‌నగర్ మండలం ఈస్గాంలో ప్రజల నివాస ప్రాంతంలోనే వైన్ షాప్ ఏర్పాటుచేయడం వల్ల మహిళలు,పిల్లలు,వృద్ధులు భయాందోళనకు గురవుతున్నారని గ్రామస్థులు రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపినా అధికారులు పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈస్గాంలో మహిళలు చేస్తున్న నిరసన కార్యక్రమంలో ప్రవీణ్ కుమార్ హాజరై,వారికి మద్దతు తెలిపారు. ఇప్పటికే వైన్ షాప్ మార్చాలని ఎక్సైజ్ సూపరింటెండెంట్, ఎక్సైజ్ కమీషనర్‌కు లేఖ రాసినా పట్టించుకోవడం లేదన్నారు. ప్రభుత్వానికి ప్రజల సంక్షేమం కంటే ఖజానాకే ప్రాధాన్యం ఇస్తున్నారని విమర్శించారు. వెంటనే ప్రజలకు అసౌకర్యాన్ని కల్పించే వెన్ షాప్‌ను ప్రజల నివాసాలకు దూరంగా మార్చకపోతే గ్రామస్థులతో కలిసి రోడ్డు పై బైఠాయించి ధర్నా చేస్తామని హెచ్చరించారు. వెంటనే ప్రభుత్వం అధికారులు స్పందించి మహిళలు,గ్రామస్థుల డిమాండ్ ను నెరవేర్చాలని కోరారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ కన్వీనర్ లెండుగురె శ్యాం రావు,సీనియర్ నాయకులు కొంగ సత్యనారాయణ, గోలెం వెంకటేష్,ఈస్గాం నాయకులు అనూప్,అషుతోష్ మండల్,రింకూ మండల్ తదితరులు పాల్గొన్నారు.

## భక్తజన సందోహం ఈస్గాం శివమల్లన్న ఆలయం

**✢ వైభవంగా షష్టిబోనాలు ✢ భక్తిశ్రద్ధలతో మొక్కులు చెల్లించుకున్న భక్తులు**

కాగజ్‌నగర్ రూరల్, నవంబర్ 30, ప్రభాతవార్త



కాగజ్‌నగర్ మండలంలోని ఈస్గాం శివ మల్లన్న స్వామి దేవాలయంలో మార్గశిర మాసం షష్టి బోనాల సందర్భంగా ఆదివారం వైభవంగా నిర్వహించారు. వివిధ గ్రామాల నుంచి భక్తులు కుటుంబ సభ్యులతో కలిసి ఆలయానికి చేరుకుని మల్లన్న స్వామిని భక్తిశ్రద్ధలతో దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. దర్శనానంతరం బోనాలకు ప్రత్యేక అలంకరణ చేసి ఒగ్గు పూజారులతో బండారి పూజలు చేయించి స్వామివారికి నైవేద్యం సమర్పించారు. రెండవ ఆదివారం మిగతా 2లో..

## నామినేషన్ ప్రక్రియ సమర్ధవంతంగా నిర్వహించాలి

(మొదటిపేజీ తరువాయి)

ఉండేలా తగిన ఏర్పాట్లు చేయాలని తెలిపారు. ఎన్నికల ప్రవర్తన నియమావళి ఖచ్చితంగా అమలు చేయాలని, నామినేషన్ కేంద్రాల వద్ద అనవసర గుంపులు, ప్రచారాలు, పోస్టర్లు, బ్యానర్లు లేకుండా చూడాలని, పోలీస్ శాఖతో కలిసి సమన్వయం చేసుకుంటూ అధికారులు చర్యలు తీసుకోవాలని తెలిపారు. నామినేషన్ సమయంలో ఏ విధమైన చట్టవిరుద్ధ చర్యలు, అడ్డంకులు చోటు చేసుకోకుండా, శాంతి భద్రతల విషయంలో పటిష్టమైన చర్యలు తీసుకోవాలని తెలిపారు. నామినేషన్ ప్రక్రియలో ప్రతి దశను అత్యంత జాగ్రత్తగా పర్యవేక్షించాలని సూచించారు. నామినేషన్ల స్వీకరణలో ఎన్నికల కమిషన్ జారీ చేసిన నియమాలకు లోబడి వ్యవహరించాలని, నామినేషన్ పత్రాల స్వీకరణ, నామినేషన్ల పరిశీలన, అభ్యర్థుల ప్రకటన, గుర్తుల కేటాయింపు ప్రక్రియలో జాగ్రత్తగా వ్యవహరించాలని తెలిపారు. నిర్ణీత గడువులోగా వచ్చిన దరఖాస్తులను మాత్రమే స్వీకరించాలని తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికలలో సమాచారం, ఫిర్యాదుల కొరకు జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సముదాయంలో కంట్రోల్ రూమ్ నం. 8500844365 ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్లు, మండల పరిషత్ అభివృద్ధి అధికారులు, ఎన్నికల విభాగం అధికారులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# లారీని ఢీ కొట్టిన ప్రైవేటు బస్సు

(మొదటిపేజీ తరువాయి)

ప్రమాదంలో గాయపడిన వారిని అంబులెన్స్లో రిమ్స్ కి తరలించారు. మృతదేహాలను పోస్టుమార్టం కోసం మార్చురీకి తరలించారు. ఈ విషయమై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టనున్నట్లు ఎస్ఐ ఇమ్రాన్ వెల్లడించారు.

### అతివేగం, నిరక్ష్యమే బస్సు

### ప్రమాదానికి కారణం...: జిల్లా ఎస్పీ

వాహన ప్రమాదాలకు అతివేగం కారణమని జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఐపిఎస్ తెలియజేశారు. ఆదివారం ఉదయం నాలుగున్నర గంటల సమయంలో హైదరాబాద్ నుంచి ఉత్తరప్రదేశ్లోని గోరఖ్పూర్కు వెళ్తున్న ప్రైవేటు సింగ్ ట్రావెల్స్ బస్సు, నేరడిగొండ మండలం బోథ్ ఎక్స్ రోడ్డు వద్ద ప్రమాదానికి గురైంది. ఈ ప్రమాదంలో బస్సు కండక్టర్, నాలుగు సంవత్సరాల బాలుడు మరణించారు. బాలుడి తల్లిదండ్రులకు తీవ్ర గాయాలు కావడంతో, ఆదిలాబాద్ రిమ్స్ ఆసుపత్రి నందు చికిత్స పొందుతున్నారు. బస్సు డ్రైవర్ అజాగ్రత్తతో మరియు నిరక్ష్యంగా అతివేగంగా వాహనాన్ని నడిపి బస్సు రోడ్డుపై వెళ్తున్న ఇతర వాహనం మధ్యలోకి వెళ్లి తెలిసి ప్రయాణికులు అడ్డు చెబుతున్న ప్రమాదానికి గురి చేయడంతో, ఇద్దరి మరణం సంభవించడంతో, బాలుడి తండ్రి బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు నేరడిగొండ పోలీస్స్టేషన్ నందు డ్రైవర్ గోవింద్ ప్రసాద్ జైస్వాల్ పై కేసు నమోదు చేయడం జరిగింది. సంఘటన స్థలాన్ని జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఐపీఎస్ పరిశీలించి నిరక్ష్యంగా వాహనాన్ని నడపడం వల్ల ప్రమాదానికి గురవుతారని, అతివేగం ప్రాణాపాయమని తెలియజేశారు. జిల్లాలో ప్రమాదాలకు గురవుతున్న ప్రదేశాలలో రంబుల్ స్ట్రిప్స్, సూచిక బోర్డులను ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. నిరంతరం వాహనదారులు హెచ్చరిక బోర్డులు ఉన్న ప్రదేశాలలో వేగాన్ని నియంత్రించి వాహనాలను నడపాలని సూచించారు. ప్రమాదంలో మరణించిన వారి వివరాలు గోరఖ్పూర్కు చెందిన రవి సింగ్, కండక్టర్. డిప్పన్ నిషాద్ (4) బాలుడు. ప్రమాద సంఘటన స్థలంలో జిల్లా ఎస్పీతో పాటుగా ఉట్నూర్ అదనపు ఎస్పి కాజల్ సింగ్ ఐపీఎస్, ఇచ్చోడా సర్కిల్ ఇన్స్పెక్టర్ రమేష్, మోటార్ ట్రాన్స్పోర్ట్ అధికారి హరింద్ర కుమార్, సిబ్బంది తదితరులు ఉన్నారు.



## అమృతాహారం తినండి ఆరోగ్యంగా ఉండండి

### - యోగా గురుజీ గుండా విజయ్ కుమార్ ఆర్య

**మంచిర్యాల, నవంబర్ 30, ప్రభాతవార్త**

మంచిర్యాల జిల్లా కేంద్రంలోని బాలుర పాఠశాల మైదానం నందు ఘనంగా అమృతాహారం నిర్వహించారు. మైదానం యందు ఉదయం 6 గంటల నుండి 7:30 గంటల వరకు ఉచిత యోగ తరగతులు నిర్వహిస్తున్నారు. యోగా తరగతులలో భాగంగా ప్రతి ఆదివారం యోగా అనంతరం అమృతాహార కార్యక్రమం యోగ సభ్యులలో ఇద్దరు అంద చేయడం జరుగుతుందని తెలిపారు. ఇప్పుడున్న జీవన శైలిలో అమృతాహారం నిత్యం ఆహారంలో అలవాటు చేసుకోవాలని, ఈ ఆహారంతో పలు రోగ సమస్యలను నివారించవచ్చని గురూజీ తెలిపారు. ఆదివారం రోజు అమృతాహార దాతలుగా పూదరి వెంకటకృష్ణ, కొలిపాక విఘ్నేశ్వర్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో గురూజీ గుండా విజయ్ కుమార్ ఆర్య, యోగ పీట్ అధ్యక్షులు ముక్త వేణుగోపాల్, ప్రధాన కార్యదర్శి కోడూరి శ్రీనివాస్, యోగ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## గోల్డెన్ నంది అవార్డు అందుకున్న ఉట్నూర్ వాసి జాదవ్ వసంత్ రావు, చవాన్ సేవాదాస్

**ఉట్నూర్, నవంబర్ 30, ప్రభాతవార్త :**

హైదరాబాద్ లోని బిర్లా సెన్స్ మ్యూజిమ్ లో ఆదివారం మెగా హెల్పింగ్ ఫౌండేషన్ వారి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఏపీజే అబ్దుల్ కలం గోల్డెన్ నంది అవార్డు కార్యక్రమం ను ఘనంగా నిర్వహించారు. అనంతరం బెస్ట్ వర్క్ శ్రీ సేవా ఫౌండేషన్ చైర్మన్, లంబాడిలా ఐక్యవేదిక ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షులు జాదవ్ వసంత్ రావు,,బెస్ట్ ఫోటో గ్రాఫర్ గా చవాన్ సేవాదాస్ లు వ్యవసాయ శాఖ మాజీ మంత్రి వేణుగోపాల్ చారీ, సినీ నటి మాహతి, మేఘ హెల్పింగ్ ఫౌండేషన్ యం డి శిరీష చేతుల మీదుగా అవార్డు అందుకున్నరు. వారికి ఫౌండేషన్ సభ్యులు శుభాకాంక్షలు తెలిపారు.



గోల్డెన్ నంది అవార్డు అందుకున్న ఉట్నూర్ వాసులు

# భక్తజన సందోహం ఈస్గాం శివమల్లన్న ఆలయం

(మొదటిపేజీ తరువాయి)

రోజున భక్తులు కుటుంబ సమేతంగా దేవాలయమునకు విచ్చేసి దేవాలయ పరిసర ప్రాంతంలో కొత్త బియ్యం మరియు బెల్లంతో నైవేద్యం తయారు చేసుకుని స్వామివారికి బోనము సమర్పించుకొని మొక్కుబడులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా భక్తులకు త్రాగునీటి సౌకర్యము, తాత్కాలిక వసతి దర్శనార్థం, ప్రత్యేక క్యూ లైన్లు ఏర్పాటు చేయడం జరిగిందని ఆలయ కార్యనిర్వాహణాధికారి వేణుగోపాల్ గుప్తా తెలిపారు. భక్తులకు ప్రైమరీ హెల్త్ సెంటర్ ఇస్గాం ఆధ్వర్యంలో ఆరోగ్య శిబిరం ఏర్పాటు చేశారు. కాగజ్నగర్ రూరల్ సిఐ కుమారస్వామి ఆదేశాల మేరకు ఇస్గాం ఎస్సై కళ్యాణ్ ఆధ్వర్యంలో భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా వాహనముల పార్కింగ్,ట్రాఫిక్ కంట్రోల్ చేయడంతో పాటు భక్తుల భద్రత చర్యలను, దేవాలయం వద్ద ఏలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసు సిబ్బందితో తగు బందోబస్తు ఏర్పాటు చేశారు. భక్తులకు త్రాగునీటి సౌకర్యం కోసం ఈస్గాం గ్రామపంచాయతీ,కాగజ్నగర్ పట్టణ మున్సిపల్ శాఖ ఆధ్వర్యంలో వాటర్ ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేసినారు శివమల్లన్న సేవా సమితి ఈస్గాం గ్రామం సేవకులు, శ్రీ అరుణోదయ విద్యాలయం కాగజ్నగర్, శ్రీ వాణి విద్యాలయం చింతగూడ విద్యార్థులు భక్తులకు దర్శన సౌకర్యార్థము,ఎలాంటి ఇబ్బందులు కల్గకుండా క్యూలైన్ల క్రమబద్ధీకరణ,త్రాగునీటి సరఫరా సేవలను అందించారు.



ఆలయ సమీపంలో బోనం తయారు చేస్తున్న భక్తులు





ఆలయంలో స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు

# నామినేషన్ స్వీకరణ ప్రారంభం

### మండలంలో సర్పంచ్కు 8, వార్డు స్థానాలకు 10 నామినేషన్ దాఖలు...

**తాండూర్, నవంబర్ 30, ప్రభాతవార్త**

రెండో విడత సర్పంచ్, వార్డు స్థానాల ఎన్నికలలో భాగంగా తాండూర్ మండలంలో ఆదివారం నామినేషన్ల స్వీకరణ ప్రారంభమైంది. మండలంలో 15 గ్రామ పంచాయతీలు ఉండగా.. మొదటి రోజు కిష్టంపేట, రాజీవ్ నగర్, బోయపల్లి, తాండూర్, కొత్తపల్లి, మాదారం పంచాయతీల సర్పంచ్ పదవికి ఒక్కొక్కరు, నీలాయపల్లి పంచాయతీ పదవికి ఇద్దరు, మండలంలో మొత్తం 8 మంది అభ్యర్థులు నామినేషన్ దాఖలు చేశారు. అదేవిధంగా బోయపల్లిలో ఇద్దరూ, తాండూర్ లో ముగ్గురు, నరసాపూర్ గ్రామపంచాయతీ వార్డు స్థానాలకు ఐదుగురు, మొత్తం 10 మంది అభ్యర్థులు నామినేషన్ దాఖలు చేశారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా తాండూర్ సీఐ దేవయ్య ఆధ్వర్యంలో ఎస్సైలు కిరణ్ కుమార్, సౌజన్య నామినేషన్ స్వీకరణ కేంద్రల్లో వద్ద పోలీసు బందోబస్తు నిర్వహించారు.



నామినేషన్ కేంద్రాల వద్ద బందోబస్తు ఏర్పాట్లను పరిశీలిస్తున్న తాండూర్ సీఐ దేవయ్య



నామినేషన్ దాఖలు చేసిన అభ్యర్థులు

## 2వ దశ నామినేషన్లు ప్రారంభం

**నర్సాపూర్ జి, నవంబర్ 30, ప్రభాతవార్త :**

ఆదివారం నర్సాపూర్ (జి) మండల కేంద్రంలో రెండవ దశ నామినేషన్లు ప్రారంభం అయ్యాయి. ఇందులో భాగంగా మండల కేంద్రంలోని మేజర్ గ్రామ పంచాయతీకి ముగ్గురు నామినేషన్లు దాఖలు చేశారు. వారిలో బరుకుంట నరేందర్, ఇంద్రకరణ్ రెడ్డి, అజయ్ కుమార్ లో ఉన్నారు. (ఆర్ఓ)రిటర్నింగ్ ఆఫీసర్ ఎర్రల్ల మురళీఅసిస్టెంట్ గంగాధర్ (ఎఆర్ఓ)

## ఆదరించండి దీవించండి అభివృద్ధి చేసి చూపిస్తా

**జాముల్ధర గ్రామ పంచాయతీ సర్పంచ్ అభ్యర్థి సలాం మంగవతి సోనేరావ్**

**లింగాపూర్, నవంబర్ 30, ప్రభాతవార్త :**



లింగాపూర్ మండలంలో జాములధరా గ్రామపంచాయతీ సర్పంచ్ అభ్యర్థిగా సలాం మంగావతి సోనేరావ్ .శనివారం నామినేషన్ దాఖలు వేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, గ్రామ పంచాయతీ అభివృద్ధి నా లక్ష్ యం అని గ్రామం కోసం మీ సేవకుడిగా పని చేస్తానని పారదర్శక పాలన సమానా అభివృద్ధిగా పనిచేస్తానని కోరారు, మీ నమ్మకమే నా బలంగా పనిచేస్తానని పేర్కొన్నారు. ప్రజలతో కలిసి గ్రామ అభివృద్ధి కోసం నిరంతరం శ్రమిస్తానని ప్రతి కుటుంబానికి సంక్షేమ ఫలాలు అందే విధంగా నిరంతరం కృషి చేసి ప్రతి కుటుంబం అభివృద్ధి చెందే విధంగా కట్టుబడి ఉంటాను. వాగ్దానాలు కాదు పనిచేసే నా సంకల్పము ఈ ఒక్కసారి సర్పంచ్ గా నన్ను గెలిపించి ఆశీర్వదించండి గ్రామ అభివృద్ధి నా లక్ష్ యం అని తెలిపారు

## సీనియర్ ఉపాధ్యాయులకు టెట్ నుంచి మినహాయింపు ఇవ్వాలి

**ఆసిఫాబాద్, నవంబర్ 30, ప్రభాతవార్త :**

సీనియర్ ఉపాధ్యాయులకు టెట్ నుండి మినహాయింపు ఇవ్వాలని టిఎస్యుటిఎఫ్ రాష్ట్ర కోశాధికారి లక్ష్మారెడ్డి పేర్కొన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని పెన్షనర్ భవన్ లో జరిగిన టిఎస్ యుటిఎఫ్ కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా కమిటీ విస్తృత సమావేశంను జిల్లా ఉపాధ్యక్షులు సోయం ఇందు రావ్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర కోశాధికారి మాట్లాడుతూ జిల్లాలోని అన్ని మండలాల్లో టిఎస్యుటిఎఫ్ సభ్యత్వాన్ని పూర్తి చేసినందుకు అభినందించారు. అదేవిధంగా అన్ని మండలాల్లో కమిటీలు ఏర్పాటు చేయాలని సూచించారు. అన్ని యాజమాన్యాలను భాగస్వాములుగా చేసినప్పుడే బలమైన ఐక్య కార్యాచరణ ప్రణాళిక అమలు చేయడానికి అవకాశం ఉంటుందన్నారు. తక్షణమే ప్రభుత్వం పిఆర్సి ప్రకటించాలని, పెండింగ్ బిల్లులు చెల్లించాలని పలు డిమాండ్లు చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి కాంపెల్లి ఉషన్న, తంగడిపల్లి రమేష్, రాజ కమలాకర్ రెడ్డి, హేమంత్ షిండే, జాదవ్ సుభాష్, రవికుమార్, మహేష్, సచిన్, పృథ్వి, రాజలింగు, బాదిరావ్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రాష్ట్ర కోశాధికారి లక్ష్మారెడ్డి

# పారదర్శకంగా వరిధాన్యం కొనుగోలు ప్రక్రియ చేపట్టాలి

*** అడిషనల్ కలెక్టర్ చంద్రయ్య**

**జైపూర్, నవంబర్ 30, ప్రభాతవార్త**

గ్రామాల్లో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో పారదర్శకంగా వరి కొనుగోలు ప్రక్రియ చేపట్టాలని మంచిర్యాల జిల్లా అడిషనల్ కలెక్టర్ చంద్రయ్య అన్నారు. ఆదివారం జైపూర్ మండలంలోని శెట్టిపల్లి, నర్సింగాపూర్, గంగిపల్లి, కుందారం గ్రామాల్లోని వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆకస్మికంగా సందర్శించి, కొనుగోలు ప్రక్రియను సమగ్రంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాలలో నాణ్యత ప్రమాణాలను పరీక్షించి నాణ్యమైన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలని సూచించారు.ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాలను ఖచ్చితంగా అనుసరించాలని, నిరక్ష్యం జగితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు. కౌలు రైతుల సమస్యలను పరిష్కరించడానికి గాను నేరుగా సంబంధి జిల్లా అధికారులతో మాట్లాడుతూ



సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డిపిఎం నాన్ ఫామ్ సారయ్య, ఏపీఎం సంతోష్ కుమార్, సీసీలు, సెంటర్ బుక్ కీపర్ తదితరులు పాల్గొన్నారు.



## ఘనంగా ముసులమ్మ బోనాలు

**వేమనపల్లి, నవంబర్ 30, ప్రభాతవార్త**

వేమనపల్లి మండలంలోని ముల్కలపేట గ్రామంలో ఉన్న ప్రణాహిత నది తీరంలో ఆదివారం భక్తజన సంద్రంగా మారింది. నది తీరంలోని ముసులమ్మ తల్లి ఆలయం వద్ద బోనాల కార్యక్రమం ఘనంగా జరిగింది. మండలంతోపాటు కోటపల్లి, చెన్నూరు, నెన్నెల, కన్నెపల్లి, భీమిని, కొమురం భీం ఆసిఫాబాద్, పోరుగున ఉన్న మహారాష్ట్ర సరిహద్దు గ్రామాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చి బోనాలు పోశారు. కొబ్బరి కాయలు కొట్టి, కోళ్లను మేకలు బలిచ్చారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్సై జగదీశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు.



కేక్ కట్ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

## ఘనంగా మంత్రి వివేక్ వెంకటస్వామి జన్మదిన వేడుకలు

**జైపూర్, నవంబర్ 30, ప్రభాతవార్త**

తెలంగాణ రాష్ట్ర కార్మిక, ఉపాధి, గనుల శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి 68వ జన్మదిన వేడుకలు జైపూర్ మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మొహమ్మద్ ఫయాజ్ ఉద్దీన్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి ఘనంగా సంబరాలు జరుపుకున్నారు. ఇందారం గ్రామంలో నవీన్ ఆధ్వర్యంలో కేకు కట్ చేసి ఘనంగా వివేక్ జన్మ దినం సంబరంగా జరుపుకున్నారు. వివేక్ వెంకటస్వామి ఆయురారోగ్యాలతో ఉండాలని వారు ఆకాంక్ష వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా జనరల్ సెక్రెటరీ రిక్కుల శ్రీనివాస్, ఆసంపెల్లి శ్రీకాంత్, పండుగ రాజన్న, అరికే సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

## లక్షెట్టిపేట, దండేపల్లిలో నామినేషన్ పత్రాల పరిశీలన

**లక్షెట్టిపేట, నవంబర్ 30, ప్రభాతవార్త**

లక్షెట్టిపేట, దండేపల్లి మండలాల్లో స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి నామినేషన్ పత్రాలను ఎన్నికల అధికారులు పరిశీలిస్తున్నారు. లక్షెట్టిపేటలో సర్పంచ్ స్థానాలకు 103, దండేపల్లిలో సర్పంచ్ స్థానాలకు 171 నామినేషన్లు దాఖలయ్యాయి. వార్డు స్థానాలకు కూడా దాఖలైన నామినేషన్లను అధికారులు పరిశీలిస్తున్నారు. సర్పంచ్, వార్డ స్థానాలకు నామినేషన్ వేసిన అభ్యర్థులు వారి మద్దతుదారులు నామినేషన్ కేంద్రాలకు తరలివచ్చారు.



పోలింగ్ కేంద్రాలను పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్

## గ్రామాల్లో మొదలైన ఎన్నికల సందడి

**వేమనపల్లి, నవంబర్ 30, ప్రభాతవార్త**

మండలంలో అన్ని గ్రామపంచాయతీలో ఎన్నికల వేడి మొదలైంది. స్థానిక ఎన్నికల ప్రక్రియలో భాగంగా గ్రామాల్లో నామినేషన్లు ప్రక్రియ కొనసాగుతున్న నేపథ్యంలో ఎన్నికల సందడి నెలకొంది. ఆయా గ్రామపంచాయతీలో ఆశావహులుగా ఉన్న సర్పంచ్ అభ్యర్థులు, వార్డు సభ్యులు నామినేషన్లను వేసేందుకు సిద్ధమవుతున్నారు. ముహూర్త బలాలు చూసుకుంటూ నామినేషన్ వేసేందుకు అభ్యర్థులు సిద్ధమవుతున్నారు. వేమనపల్లి మండలంలో 14 గ్రామ పంచాయితీల్లో పోటీలో ఉండే అభ్యర్థులు మొదటి రోజు 8 సర్పంచ్‌లు, 1 వార్డు సభ్యుల నామినేషన్ దాఖలు అయినట్లు ఎంపిడిఓ కుమారస్వామి తెలిపారు.నామినేషన్ కేంద్రాలను పరిశీలన, జిల్లెడ పాఠశాలలో గల నామినేషన్ కేంద్రాన్ని బెల్లంపల్లి సబ్ కలెక్టర్ మనోజ్ కుమార్ ఆదివారం పరిశీలించారు. నామినేషన్ సంబంధించిన ఏర్పాట్లను పర్యవేక్షించారు. నామినేషన్ కేంద్రాల్లో చేపట్టావల్సిన పనులు, విధులపై వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ వెంకటేష్, ఆర్ఐ ఖాళిక్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

## ఇష్టపడి చదివితే లక్ష్యసాధన సులభతరం

**- మంచిర్యాల జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) పి. చంద్రయ్య**

**మంచిర్యాల, నవంబర్ 30, ప్రభాతవార్త**

విద్యార్థులు ఇష్టపడి చదివితే ఎంచుకున్న లక్ష్యాన్ని సాధించడం సులభతరం అవుతుందని మంచిర్యాల జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) పి. చంద్రయ్య అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని షెడ్యూల్డ్ కులముల బాలికల కళాశాల, సంక్షేమ వసతి గృహాన్ని జిల్లా షెడ్యూల్డ్ కులముల అభివృద్ధి శాఖ ఉపసంచాలకులు చాతరాజుల దుర్గాప్రసాద్‌తో కలిసి సందర్శించి విద్యార్థులకు కల్పిస్తున్న సౌకర్యాలను పరిశీలించారు. ఈ సందర్భంగా మంచిర్యాల జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులు తాము ఎంచుకున్న కోర్సులను ఇష్టపడి చదివి ఉన్నత స్థానాలకు చేరుకోవాలని తెలిపారు. ప్రభుత్వం విద్యావ్యవస్థను బలోపేతం చేస్తూ విద్యార్థులకు సకల సదుపాయాలతో కూడిన నాణ్యమైన విద్యను అందిస్తుం దని, విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ప్రస్తుత ప్రపంచంలో భారత్ దేశంలో మాత్రమే నైపుణ్యాలతో కూడిన యువత అందుబాటులో ఉందని, విద్యార్థులు తమ జీవితంలో ఉన్నత లక్ష్యాలను సాధించి మంచి స్థానాల్లో స్థిరపడాలని ఆకర్షించారు. అనంతరం విద్యార్థులకు చలికాలం దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సహాయ షెడ్యూల్ కులాల అభివృద్ధి అధికారి కె. ధర్మానంద్ గౌడ్, వసతి గృహ సంక్షేమ అధికారి డి.చందన, విద్యార్థినులు పాల్గొన్నారు.





పార్టీలో చేరిన వారితో మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప

## బిఆర్ఎస్ పార్టీలో చేరికల జోరు

**కాగజ్‌నగర్, నవంబర్ 30, ప్రభాతవార్త**

మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప నాయకత్వాన్ని బలపరుస్తున్న సిర్పూర్ తాలూక ప్రజలు స్థానిక ఎన్నికల సందడి వేళ సిర్పూర్ నియోజకవర్గంలో తాజా మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప నాయకత్వాన్ని బలపరుస్తూ బిఆర్ఎస్ పార్టీలో చేరికలు జోరందుకున్నాయి. రెండు రోజులుగా పార్టీలో చేరికలు ఊపొందుకున్నాయి. పలు మండలాల నుండి పలువురు బీజేపీ పార్టీలకు చెందిన నాయకులు మాజీ ఎమ్మెల్యే సమక్షంలో బిఆర్ఎస్ కండువా కప్పుకున్నారు. కౌటాల మండల ముత్తంపేట్ గ్రామ బీజేపీ యువ నాయకులు డోంగ్రీ సరోజామొరేశ్వర్ బిఆర్ఎస్ పార్టీలో చేరారు.



బీసీల యుద్ధభేరి లోపాల్గొన్న బీసీ జేఏసీ జిల్లా చైర్మన్ రూపునర్ రమేష్, నాయకులు

## బీసీల 42 శాతం రిజర్వేషన్ సాధించి తీరుతాం

**ఆసిఫాబాద్, నవంబర్ 30, ప్రభాతవార్త :**

బీసీల 42 శాతం రిజర్వేషన్ సాధించి తీరుతామని బీసీ జేఏసీ కుమురంభీమ్ జిల్లా చైర్మన్ రూపునర్ రమేష్ పేర్కొన్నారు. రాష్ట్ర బీసీ జేఏసీ ఆధ్వర్యంలో ఆదివారం హైదరాబాద్ లోని ధర్నా చౌక్ లో నిర్వహించిన బీసీల రాజకీయ యుద్ధభేరి సభలో బిసి నాయకులతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీసిలకు 42 శాతం రిజర్వేషన్ ఆశలు చూపించి బీసీల గొంతు కోసిన సీఎం రేవంత్ రెడ్డికి బీసీలు తగిన బుద్ధి చెప్తారన్నారు. బీసీలపై కేంద్ర ప్రభుత్వం సమితి తల్లి ప్రేమ చూపిస్తుందని, రాష్ట్ర ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే అచలపక్షంతో ఢిల్లీ వెళ్లి మోడీ సర్కారుపై ఒత్తిడి తేవలన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల కుట్ర ఫలితమే బీసీలకు రిజర్వేషన్ కల్పించకుండా ఎన్నికలకు వెళ్తున్నారని విమర్శించారు. బీసీల ఓట్లతో పదవులు అనుభవిస్తున్నటువంటి రాజకీయ నాయకులను రోడ్లమీద తిరుగునివ్వమని, రాష్ట్రాన్ని ఎక్కడిక్కడ దిగ్బంధనం చేస్తామన్నారు. ఈ సభలో కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా బీసీ జేఏసీ జిల్లా కోఆర్డినేటర్ ఆవిడపు ప్రణయ్ బీసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షులు లోబడి లవ్ కుమార్, బీసీ యువజన సంఘం ఆసిఫాబాద్ డివిజన్ అధ్యక్షులు బొట్టుపల్లి ప్రశాంత్, బీసీ నాయకులు శెండే నాందేవ్, అరుణ్, కిరణ్, తరుణ్, నవీన్, వినయ్ తదితరులు పాల్గొన్నారు.

## నామినేషన్ కేంద్రాలు వద్ద హెల్ప్‌డెస్క్‌లు ఏర్పాటు

**తాండూర్, నవంబర్ 30, ప్రభాతవార్త :**

రెండోవిడత ఎన్నికల్లో భాగంగా నామినేషన్ (క్లస్టర్లు) కేంద్రాల వద్ద హెల్ప్ డెస్క్ లను ఏర్పాటు చేశారు. హెల్ప్ డెస్క్ లను ఆదివారం ఎంపీడీవో శ్రీనివాస్, ఎస్సై కిరణ్ కుమార్ పరిశీలించారు. నామినేషన్ దాఖలు చేసే విషయంలో అభ్యర్థులకు హెల్ప్ డెస్క్‌ల వద్ద విధుల్లో ఉన్న ఎన్నికల సిబ్బంది అవసరమైన సహకారాన్ని అందించాలని వారు సూచించారు. ఏమైనా సందేహాలు ఉంటే వెంటనే ఉన్నత అధికారులు సంప్రదించాలన్నారు.



హెల్ప్‌డెస్క్ ను పరిశీలిస్తున్న ఎంపీడీవో శ్రీనివాస్,ఎస్సై కిరణ్ కుమార్

# సేవే మార్గం... ప్రేమే లక్ష్యం..

**- మానవసేవే మాధవసేవ - ప్రజాసేవే అయన ఊపిరిగా, మానవత్వనికి నిలువెత్తు నిదర్శనం - నేటి యువతకు మార్గదర్శం**



పెసరికుంట చౌరస్తా వద్ద సిమెంట్ కుర్చీ అందజేస్తు..



పెసరికుంట చౌరస్తా వద్ద సిమెంట్ కుర్చీ అందజేస్తు..



గ్రామంలో రోడ్డుకు మట్టి పోయిస్తూ..

**దహెగాం, నవంబర్ 30, ప్రభాతవార్త :**

కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా దహెగాం మండలం పెసరికుంట గ్రామానికి చెందిన యువకుడు కుమ్మరి సతీష్ సేవే మార్గం ప్రేమే లక్ష్యం మానవసేవే మాధవసేవ అని ముందుకెళ్తున్నాడు. గ్రామంలోని ఎన్నో సేవ కార్యక్రమాలకు శ్రీకారం చుట్టి యువతకు ఆదర్శనంగా నిలుస్తున్నాడు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెట్టిన వివిద రకాల కార్యక్రమాలను ప్రజలలోకి తీసుకెళ్తూ, వాటిపై గ్రామ ప్రజలకు అవగాహనా కల్పిస్తున్నాడు. సేవ కార్యక్రమంలో ముందుంటాడు గ్రామంలో ఏ సేవ అయిన ముందుండి చురుగ్గా పాల్గొంటాడు. ఎవరికీ ఏ ఆపదోచ్చిన నేనున్నాంటూ ముందుంటాడు. పెదాలను ఆదుకుంటాడు వారికీ అండగా ఉంటాడు. గ్రామంలోని వర్షానికి బురుదమయం అయిన రోడ్లకు మట్టి, మొరం పోయించాడు. యువతతో కలిసి శ్రమధాన కార్యక్రమాలు నిర్వహిస్తుంటారు. క్రీడాకారులను ప్రోత్సహించడం.. గ్రామంలోని క్రీడాకారులకు వాలీబాల్ కిట్లు, క్రికెట్ కిట్లు అందించి వారిని ప్రోత్సహించడం. అయన సొంత ఖర్చులతో ఆటకు సంబందించిన సామాగ్రిని యువతకు అందిస్తున్నాడు. విద్యార్థులకు చేయూత గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు తన జన్మదినం సందర్భంగా పెన్నులు, పెన్సిలు నోట్‌బుక్స్‌లు పంపిణి చేసారు. అంగన్వాడీ కేంద్రానికి అయన తండ్రి జ్ఞాపకార్థం నెబులైజర్ పంపిణి చేశారు.



పాఠశాలలో నోట్స్ బుక్స్, పెన్నులు అందజేస్తూ..

### గ్రామానికి సేవచేయడం నా అదృష్టం

### - కుమ్మరి సతీష్, పెసరికుంట



గ్రామానికి సేవచేయడం నా అదృష్టం గ్రామంలోని అందరు మద్దతు చేయబట్టే నేను సేవ కార్యక్రమాలు చేస్తున్నానని ఇంకా ఎన్నో సేవ కార్యక్రమాలు చేస్తాను అందరికి అండగా ఉంటాను గ్రామ ప్రజలు, యువత ఎల్లప్పుడూ నాకు మద్దతుగా ఉండాలని నేను అనేక సేవ కార్యక్రమాలు చేయాలనీ కోరుకుంటున్నాను.

## ముగిసిన మొదటి విడత నామినేషన్లు

**- ప్రారంభమైన రెండో విడత నామినేషన్లు**

**ఆసిఫాబాద్, నవంబర్ 30, ప్రభాతవార్త :**

పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో జిల్లాలోని ఆసిఫాబాద్ నియోజకవర్గం పరిధిలోని ఐదు మండలాల్లో తొలి విడత నామినేషన్ల ప్రక్రియ శనివారంతో ముగిసింది. శనివారం మధ్యాహ్నం వరకు నత్తనడకన సాగిన నామినేషన్ల ప్రక్రియ నాలుగు గంటల తర్వాత ఊపందుకుంది. దీంతో ఒకేసారి నామినేషన్ కేంద్రాలకు పెద్ద ఎత్తున సర్పంచ్, వార్డు సభ్యుల ఆశావాహులు చేరుకోవడంతో నామినేషన్ కేంద్రాలు కిక్కిరిసిపోయాయి. క్యూలైన్లో నిలబడ్డ ఆశావాహులతో రాత్రి ఒంటి గంట వరకు అధికారులు నామినేషన్ పత్రాలను స్వీకరించారు. జైనుర్ మండలంలోని 26 గ్రామ పంచాయతీలకు 124 నామినేషన్లు రాగ, కెరమెరి 31కి 156, లింగాపూర్ 14కి 52, సిర్పూర్(యు) లో 15కి 56, వాంకిడిలో 28కి 106 నామినేషన్ వచ్చాయి. వార్డ్ సభ్యులకు గాను జైనుర్ మండలంలోని 222 వార్డులకు 314 నామినేషన్లు రాగ, కెరమెరి 250కి 383, లింగాపూర్ 112కి 163, సిర్పూర్(యు) లో 124కి 159, వాంకిడిలో 237కి 407 నామినేషన్లు వచ్చాయి. రెండో విడత ఎన్నికలు జరిగే కాగజ్ నగర్ నియోజకవర్గంలోని ఆరు మండలాలకు నామినేషన్ల ప్రక్రియ ఆదివారం ప్రారంభమైంది.

## ఘనంగా పెద్దమ్మతల్లికి బోనాలు సమర్పన

**సారంగాపూర్, నవంబర్ 30, ప్రభాతవార్త :**



మండలంలోని కౌట్ల(బి) గ్రామంలో పెద్దమ్మ తల్లి మూడో వార్షికోత్సవం ఘనంగా ముగిసింది. వార్షికోత్సవంలో భాగంగా గ్రామంలో బోనాలు ఊరేగింపు తీయడం జరిగింది. ఇందులో శివసత్తులు నృత్యాలతో గ్రామాల వీధుల వెంబడి ఉల్లాసంగా నృత్యాలు ప్రదర్శిస్తూ ఊరేగింపుగా బోనాల తీసుకువచ్చి అమ్మవారికి నైవేద్యం సమర్పించడం జరిగింది. అనంతరం అన్నదాన కార్యక్రమం చేయడం జరిగింది. ఇందులో చుట్టుపక్కల గ్రామాల ప్రజలు అందరూ పాల్గొని విజయవంతం చేసినారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు,ముదిరాజ్ కుల పెద్దలు గ్రామ ప్రజలందరూ పాల్గొన్నారు.

## మావోయిస్టుల పట్ల కేంద్ర ప్రభుత్వం పునరాలోచించాలి

**- కలవేన శంకర్ సిపిఐ రాష్ట్ర కార్యదర్శి**

**- స్థానిక సంస్థల ఎన్నికల్లో సిపిఐ అభ్యర్థులను గెలిపించండి**

**మంచిర్యాల, నవంబర్ 30, ప్రభాతవార్త**

సిపిఐ జిల్లా కార్యాలయంలో జిల్లా కార్యవర్గ సమావేశం కారుకూరి నాగేష్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశంలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కలవేన శంకర్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఆయన మాట్లాడుతూ జిల్లాలో పోటీ చేస్తున్న సిపిఐ సర్పంచ్, వార్డు మెంబర్ అభ్యర్థులను గెలిపించాలని ప్రజలను కోరారు. అలాగే, మావోయిస్టుల పట్ల కేంద్ర ప్రభుత్వం తన వైఖరిని పునరాలోచించి, శాంతి చర్చల ద్వారా సమస్యకు పరిష్కార మార్గం ఎంచుకోవాలని సూచించారు. మావోయిస్టు కేంద్ర కమిటీ నాయకుడు హిడ్మా మృతి చెందిన ఘటనను బూటకపు ఎన్‌కౌంటర్‌గా అభివర్ణిస్తూ, దానికి వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా అన్ని వర్గాల ప్రజలు నిరసన వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. మెజారిటీ ప్రజల ఆలోచనలకు కేంద్ర ప్రభుత్వం గౌరవం ఇవ్వాలని డిమాండ్ చేశారు. అదే విధంగా డిసెంబర్ 26న రామకృష్ణాపూర్‌లో సిపిఐ శత జయంతి ముగింపు బహిరంగ సభ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సభకు అన్ని వర్గాల ప్రజలు హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సిపిఐ జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్, మేకల దాసు, మిట్టపల్లి వెంకటస్వామి, చిప్ప నర్సయ్య, బొల్లం పూర్ణిమ, రేగుంట చంద్రశేఖర్, రేగుంట చంద్రకళ, జోగుల మల్లయ్య, ఇప్పకయల లింగయ్య, మిట్టపల్లి శ్రీనివాస్, దుర్గారాజ్, ఆడెపు రాజమోగిలి, కొండు బాణేష్, పార్టీ నాయకులు పాల్గొన్నారు.




మాట్లాడుతున్న సిపిఐ నాయకులు

# కాంగ్రెస్, బిజెపిలతో నాయకులు సమయం వృధా చేసుకోవద్దు

## - బిఆర్ఎస్‌లో చేరండి అద్భుతాలు సృష్టిద్దాం : రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డా.ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్

**కాగజ్‌నగర్ ,నవంబర్ 30, ప్రభాతవార్త :**

సిర్పూర్ మండల మాజీ ఎంపిపి మాలతి మనోహర్ ఆదివారం బిఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డా.ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో బిజెపి పార్టీ నుండి బిఆర్ఎస్ పార్టీలో చేరారు. కాగజ్‌నగర్ పట్టణంలోని బాలాజీనగర్‌లో మాలతి మనోహర్‌లకు బిఆర్ఎస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ బిజెపి కాంగ్రెస్ పార్టీలతో అభివృద్ధి సాధ్యం కాదని,ఆ పార్టీలో పనిచేసే నాయకులు అవమానాలకు గురై నామమాత్రపు నాయకులుగా మిగిలిపోతారని తెలిపారు. ఆత్మగౌరవాన్ని చంపుకొని నాయకుల గెలుపుకోసం పని చేసినా సరైన గుర్తింపు దక్కదన్నారు. అందుకే సిర్పూర్ అభివృద్ధి కోసం,నియోజకవర్గ సంక్షేమం కోసం,దోపిడీ నాయకుల నుండి విముక్తి కోసం నాయకులు బిఆర్ఎస్ వైపు రావాలని ప్రవీణ్ కుమార్ పిలుపునిచ్చారు. కాంగ్రెస్,బిజెపి పార్టీలో ఉంటూ మీ విలువైన సమయాన్ని వృధా చేసుకోవద్దని సూచించారు. రాబోయే కాలంలో బిఆర్ఎస్ పాలనలో అద్భుతము సృష్టిద్దామని,అందులో భాగస్వాములు కావాలని ఆహ్వానించారు. బిజెపి ఎమ్మెల్యేతో అభివృద్ధి జరగడం లేదని, పదవి వచ్చిన తర్వాత ఎమ్మెల్యే ప్రజలకు దూరమయ్యారని, స్థానిక నాయకులను అణిచివేసే ధోరణితో పని చేస్తున్నారని సిర్పూర్ మాజీ ఎంపిపి మాలతీ ఆరోపించారు. అందుకే ప్రవీణ్ కుమార్ నాయకత్వంలోనే సిర్పూర్ తాలూకా అభివృద్ధి సాధ్యమని నమ్మి,ప్రవీణ్ కుమార్ పని విధానం నచ్చడంతో ఆయన నాయకత్వంలో పనిచేయాలని నిర్ణయించుకొని బిఆర్ఎస్ పార్టీలో చేరినట్లు మాజీ ఎంపిపి మాలతి తెలిపారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ కన్వీనర్ లెండుగురె శ్యాంరావు, సీనియర్ నాయకులు కొంగ సత్యనారాయణ,పట్టణ నాయకులు తన్నీరు పోచం,నక్క మనోహర్,వాసు,సిర్పూర్ నాయకులు చాంద్ పాషా తదితరులు పాల్గొన్నారు.



బిఆర్ఎస్ పార్టీలో చేరిన వారితో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డా.ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్

# బిఆర్ఎస్ నుంచి కాంగ్రెస్ పార్టీలో చేరిక

**తాండూర్, నవంబర్ 30, ప్రభాతవార్త :**

బిఆర్ఎస్ పార్టీ మైనార్టీ మండల ఉపాధ్యక్షులు అబ్దుల్ ముహా 50 మంది యువకులతో కలిసి శనివారం రాత్రి కాంగ్రెస్ పార్టీలో చేరారు. వీరికి కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు ఎండి ఈసా, మాజీ ఎంపీపీ సిరంగి శంకర్ పార్టీ కండువ కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీ మండల అధ్యక్షుడు మాట్లాడుతూ ఈనెల 14న జరుగనున్న సర్పంచ్, వార్డు స్థానాలలో కాంగ్రెస్ పార్టీ బలపరిచే అభ్యర్థులను గెలిపించుటకు నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు ఎండి జుబేర్, ముడిమడుగుల సురేష్, సర్వర్ బేగ్, రావూఫ్, శంకర్, తదితరులు పాల్గొన్నారు.



కాంగ్రెస్ పార్టీలో చేరిన అబ్దుల్ మూహా,యువకులు

# ఘనంగా కార్మికశాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి జన్మదిన వేడుకలు

## రామకృష్ణాపూర్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో సంబరాలు - ముఖ్య అతిథిగా డీసీసీ చీఫ్ పిన్నింటి రఘునాథరెడ్డి

**రామకృష్ణాపూర్, నవంబర్ 30, ప్రభాతవార్త**

కార్మికశాఖ మంత్రి చెన్నూరు ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి జన్మదినోత్సవాన్ని రామకృష్ణాపూర్ కాంగ్రెస్ పార్టీ ఘనంగా నిర్వహించింది. పట్టణంలోని కాంగ్రెస్ కార్యాలయంలో పట్టణ అధ్యక్షుడు పల్లె రాజు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి జిల్లా డీసీసీ అధ్యక్షులు పిన్నింటి రఘునాథరెడ్డి ముఖ్య అతిథిగా హాజరై నాయకులతో కలిసి కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, గడ్డం వివేక్ వెంకటస్వామి ఆశీస్సులతోనే డీసీసీ అధ్యక్ష పదవికి వచ్చాను. ఈ నమ్మకానికి తగ్గట్లు జిల్లా కాంగ్రెస్ బలోపేతానికి కృషి చేస్తాను. రాబోయే గ్రామపంచాయతీ ఎన్నికల్లో పార్టీ గెలుపుకోసం క్యాడర్ అంతా శక్తులు పెట్టాలి అని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమం అనంతరం కాంగ్రెస్ నాయకులు అన్నదానం నిర్వహించారు. ఈ వేడుకలో భూపతి రాజయ్య, వర్ణాల శ్రీనివాస్, మహంకాళి శ్రీనివాస్, గాండ్ల సమ్మయ్య, అబ్దుల్ అజీజ్, యువకాంగ్రెస్ జిల్లా కార్యదర్శి పల్లె దినేష్, వైస్ ప్రెసిడెంట్ భువనగిరి రవీందర్, ఎన్ఎస్‌యుఐ రామ్ సాయి, ఐఎన్‌టియుసి రాంబాబు, వైస్ చైర్మన్ సాగర్ రెడ్డి, పలిగిరి కనకరాజు, కుర్మ సురేందర్, బత్తుల వేణు, పుల్లూరి కళ్యాణ్, కట్ల రమేష్ తదితరులు పాల్గొన్నారు. మహిళా నాయకురాళ్లు పుష్ప, దీప, సృజన, రాజేశ్వరి, సునీత, శారదతో పాటు అనేక మంది కార్యకర్తలు, అభిమానులు భారీగా హాజరయ్యారు.



జన్మదిన వేడుకలు నిర్వహిస్తున్న దృశ్యం



నామినేషన్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్,సబ్ కలెక్టర్

# నామినేషన్ ప్రక్రియ సమర్థవంతంగా నిర్వహించాలి

**బెజ్జూర్, నవంబర్ 30, ప్రభాతవార్త**

బెజ్జూర్ మండలంలోని ఊట్సా రంగపల్లి గ్రామపంచాయతీలో ఏర్పాటుచేసిన నామినేషన్ స్వీకరణ కేంద్రాన్ని ఆదివారం జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) దీపక్ తివారి,కాగజ్ నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధ శుక్లా తో కలిసి పరిశీలించారు.ఈ సందర్భంగా రిటర్నింగ్,సహాయ రిటర్నింగ్ అధికారులు నామినేషన్ ప్రక్రియను పూర్తి పారదర్శకంగా,సమర్థవంతంగా నిర్వహించాలని తెలిపారు.నామినేషన్ పత్రాల ధృవీకరణ,అభ్యర్థుల వివరాల నమోదు, అవసరమైన రికార్డుల నిర్వహణ అంశాలను పకడ్బందీగా నిర్వహించాలని, నామినేషన్ల స్వీకరణలో ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు.అభ్యర్థుల నామినేషన్ ప్రక్రియకు ఎలాంటి ఆటంకాలు లేకుండా చూసుకోవాలని తెలిపారు.ఎన్నికల ప్రవర్తన నియమావళిని కచ్చితంగా పాటించాలని అన్నారు.నిర్ణీత గడువులోగా వచ్చిన దరఖాస్తులను మాత్రమే స్వీకరించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ ప్రవీణ్ కుమార్,ఎన్నికల విభాగం అధికారులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# మొదటి రోజు ప్రారంభమైన నామినేషన్లు

**బెజ్జూర్,నవంబర్ 30, ప్రభాతవార్త:**

బెజ్జూర్ మండలంలో ఎన్నికల నేపథ్యంలో ఏర్పాటు చేసిన ఐదు నామినేషన్ కేంద్రాల్లో మొదటి రోజు ఆదివారం ఉదయం 10 గంటలకు నామినేషన్లు ప్రారంభమయ్యాయి. ఆదివారం సాయంత్రం 5:00 వరకు ఐదు కేంద్రాల్లో కలిపి మొత్తం 5 సర్పంచ్ నామినేషన్లు,12 వార్డ్ మెంబర్ల నామినేషన్లు వచ్చినట్లు ఎంపీడీఓ ప్రవీణ్ కుమార్ తెలిపారు.

# నామినేషన్ కేంద్రాన్ని పరిశీలించిన అడిషనల్ కలెక్టర్ దీపక్ తివారి

**పెంచికల్ పేట్, నవంబర్ 30, ప్రభాతవార్త:**

గ్రామ పంచాయతీ సర్పంచ్ ఎన్నికల నామినేషన్ల స్వీకరణ శాంతియుతంగా, పారదర్శకంగా సాగేందుకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశారు. ఈ నేపథ్యంలో మండలంలోని ఎల్కపల్లి గ్రామ పంచాయతీలో ఏర్పాటు చేసిన నామినేషన్ కేంద్రాన్ని జిల్లా స్థానిక సంస్థల కలెక్టర్ దీపక్ తివారి, కాఘజ్ నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధ శుక్లా ఆదివారం పరిశీలించారు. నామినేషన్ కేంద్రంలో ఏర్పాటు చేసిన కౌంటర్లు, భద్రతా చర్యలు, సీసీ కెమెరాల పర్యవేక్షణ, త్రాగునీటి సదుపాయాలు, పోలీస్ బందోబస్తు వంటి అంశాలను అధికారులు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నామినేషన్ల స్వీకరణలో ఎలాంటి అంతరాయం లేకుండా చర్యలు తీసుకోవాలని నామినేషన్ కేంద్రానికి 100మీటర్ల దూరం వరకు ప్రజలను, వాహనాలను అనుమతించారాదని నామినేషన్ కేంద్రంలోకి అభ్యర్థి వెంట ముగ్గుకి మాత్రమే అనుమతి ఇవ్వాలని సంబంధిత విభగాధికారులను అదేశించారు. అభ్యర్థులు నిబంధనలను పూర్తిగా పరిశీలించి నామినేషన్లు దాఖలు చేయాలని సూచించారు. వారి వెంట మండల ఎన్నికల అధికారి ఆల్బర్ట్, తహసీల్దార్ తిరుపతి, ఎస్సై అనిల్ కుమార్, అధికారులు పాల్గొన్నారు.



ఎల్కపల్లి నామినేషన్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న అధికారులు